


**జరిగిన కథ :**

కన్యాకుబ్జాన్ని పాలించే తాళధ్వజుడనే రాజుకు అనేకమంది కుమారులు ఉన్నారు. వారిలో మొదటి అయిదుగురూ.. తూర్పుదిశలో దిగ్విజయ యాత్రలు చేసి, అందగత్తెలను పెళ్లాడి.. తిరిగి ఇల్లు చేరారు. ఆ తరువాతి అయిదుగురి పేర్లు వరుసగా.. విద్యాసాగరుడు, కళాభిరాముడు, హరివర్మ, సుధర్ముడు, సులోచనుడు. వీళ్లు అయిదుగురూ విద్యాసాగరుని ఆధ్వర్యంలో ఒకనాడు తండ్రిని చూడటానికి వచ్చారు.




# మహిళారాజ్యంలో మగధీరుడు


అనుసృజన:
**నేతి సూర్యనారాయణ శర్మ**


‘‘తండ్రీ! అన్నల్లాగే మాకు కూడా దిగ్విజయ యాత్రకు అనుమతి ఇవ్వండి’’ అని కోరాడు విద్యాసాగరుడు.

‘‘తగినంత సైన్యం తీసుకుని ఉత్తరదిక్కుకు వెళ్లండి’’ అని చెప్పాడు తాళధ్వజుడు.

విద్యాసాగరుని ఆధ్వర్యంలో ఆ రాజకుమారులు.. మాళవం, నేపాళం, మగధ, కాశ్మీరం, కోసల, కురు దేశాలను జయించారు. ఆ రాజులందరినీ సామంతులను చేసుకున్నారు. అక్కడితో తృప్తిపడి ఇంటిబాట పట్టారు.

సైన్యాలతో కలిసి ఉత్తర దేశ అరణ్యాల వెంట వస్తుండగా.. వాతదోషం వల్ల పదాతి దళంలోని సైనికులందరూ ఒకరి తరువాత ఒకరుగా రోగపీడితులు కాసాగారు. ఏనుగులు ఉన్నట్లుండి మావటీలను పడదోయ సాగాయి. గుర్రాలు ముందరికాళ్లు ఎగరేసి రౌతులను కిందపడేయ సాగాయి. ఆ సమయంలో ప్రళయ సూచనగా ఒక జంఝూమారుతం బయల్దేరింది. రాజపుత్రులు తమ గుర్రాలనెక్కి అక్కణ్నుంచి తప్పించుకునే ప్రయత్నం చేశారు. కానీ, బలమైన గాలి విసురుకు.. ఆ అయిదుగురూ తమ గుర్రాలతో సహా తలోదిక్కుకూ పడ్డారు. పెద్దవాడైన విద్యాసాగరుడు.. గాలి విసురుకు కొట్టుకుపోతూ ఏ చెట్టు కొమ్మనైనా ఆసరాగా పట్టుకోవడానికి ఎంతగానో ప్రయత్నించాడు. కానీ సాధ్యం కాలేదు. చాలాసేపటివరకు గాలికి అలా ఎంతోదూరం కొట్టుకుపోతూనే ఉన్నాడు. చివరికి పర్వతంలాంటి ఒక గోడ అడ్డం రావడంతో గుర్రం నేలకు జారిపోయింది. అంతలో గాలి కూడా తగ్గింది.

దెబ్బలు సవరించుకుంటూ మెల్లగా లేచి, గుర్రానికి అలుపు తీర్చి నలుదిక్కులా పరికించి చూశాడు విద్యాసాగరుడు. అప్పటికే చీకటి పడుతుండటంతో తానెక్కడ ఉన్నదీ తెలుసుకోలేక పోయాడు. ‘ఎటు వెళ్తే ఏం ప్రమాదమో?’ అనే శంకతో.. గుర్రపు జీనును కింద పరుచుకుని, అక్కడే కూలబడ్డాడు. తన తమ్ముళ్లందరూ ఏమైపోయారో అని చింతిస్తూ రాత్రంతా గడిపాడు.

తెల్లవారిన తరువాత తానొక పెద్ద కోటగోడ పక్కన ఉన్నానని తెలుసుకున్నాడు. ఆ గోడ చాలా ఎత్తుగా ఉంది. గోడవెంట ఉత్తరదిక్కుగా చాలాదూరం ప్రయాణించాడు. ఎంత దూరం వెళ్లినా లోనికి వెళ్లేందుకు ద్వారం కనిపించలేదు.

తిరిగి వెనక్కు వచ్చి రెండోదిక్కుగా ముందుకు వెళ్లాడు. కానీ, ఆ దారిలో గుట్టలు ఎక్కువగా ఉండటంతో గుర్రాన్ని నడపలేక పోయాడు. చేసేది లేక బయల్దేరిన చోటికే తిరిగి వచ్చాడు. గుర్రాన్ని మేతకు వదిలి, ఆ గోడను నిశితంగా పరిశీలిస్తూ కొంతసేపు గడిపాడు.

అలా చూడగా చూడగా.. ఒకచోట పైరాళ్లు దొర్లడం వల్ల కోటగోడ కొంచెం ఎత్తు తగ్గడం గమనించాడు. విద్యాసాగరుడు ఆ చోటు గుర్తుపెట్టుకున్నాడు. అక్కణ్నుంచి దూరంగా వెనక్కి వెళ్లి.. గుర్రాన్ని ముందుకు పరిగెత్తించి, గోడ దూకించడానికి ప్రయత్నించాడు. కానీ ఊతం చాలలేదు. దాంతో రెండుసార్లు వెనక్కు తిరిగి రావాల్సి వచ్చింది.

మూడోసారి కళ్లెం గట్టిగా లాగి పట్టుకున్నాడు. మడమలతో కొడుతూ.. ప్రాణాలు పోయినా సరే ఈసారి కోటదాటక తప్పదని సంజ్ఞచేస్తూ వేగంగా తోలాడు. ఆ గుర్రం కూడా తన శక్తినంతా చూపింది. ఉన్నట్లుండి రెక్కలు మొలిచినట్లు గాల్లోకి లేచింది. అతికష్టంమీద గోడమీదికి లంఘించింది. కోటగోడ మీద రెండు నిమిషాలు నిలబడగలిగింది.

అక్కడ గుర్రం నాలుగుకాళ్లూ నిలపడానికి తగినంత చోటులేదు. అందువల్ల వెంటనే లోపలికి దూకాల్సి వచ్చింది. కానీ, అప్పటికే గుర్రానికి అలసట ఎక్కువై.. గిలగిల తన్నుకుని ప్రాణాలు విడిచిపెట్టింది.

‘‘అయ్యయ్యో! ఉచ్ఛైశ్రవంతో పోల్చదగిన ఉత్తమ జాతి అశ్వాన్ని నా తొందరపాటుతో చేజేతులా చంపుకొన్నాను’’ అని కొద్దిసేపు దుఃఖించాడు విద్యాసాగరుడు. మొలలో ఉన్న కత్తితో ఒక గొయ్యి తవ్వి, గుర్రాన్ని పూడ్చిపెట్టాడు. అక్కణ్నుంచి ఎటూ కదలడానికి మనస్కరించ లేదు. తన గుర్రమే మాటిమాటికీ గుర్తొస్తుండగా..